ఈసారైనా పోలింగ్
50 శాతం దాటుతుందా?

• జంట సర్కిళ్ల పరిధిలో 7,24,466 మంది ఓటర్లు • కుత్బుల్లాపూర్, గాజులరామారం పరిధిలో 592 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



కుత్బుల్లాపూర్: ఓటే మీ స్వరం... తప్పనిసరిగా మీ ఓటును వేయండి.. అంటూ ఎన్నికల కమిషన్ ఎస్ఎంఎస్‌ల ద్వారా ఓటర్లకు మెసేజ్‌లు పంపుతూ ఓటింగ్ శాతాన్ని పెంచే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇప్పటికే పలు సంక్షేమ సంఘాలు, కాలనీలు, మురికివాడ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి ఓటర్లలో చైతన్యం నింపే ప్రయత్నం స్థానిక ఎన్నికల అధికారులు చేశారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్ సరళి 50శాతం వరకు మాత్రమే అవుతోంది.

గణనీయంగా పెరిగిన ఓటర్లు...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు కాగా నిజాంపేట్ కార్పొరేషన్‌గా ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రేటర్‌లో విలీనమై ఉన్న కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం ఓటర్లు 7,24,466 తుది జాబితా విడుదల చేయగా.. మొత్తం 592 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు తాజాగా జరుగుతున్న లోక్ సభ ఎన్నికలకు 25,336 మంది ఓటర్లు పెరిగారు.

కుటుంబీకుల అందరూ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా..?

◆ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న పులి సైదులు ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటూ వస్తున్న నేపథ్యంలో వారికి ఒకే పోలింగ్ కేంద్రాన్ని ఎంపిక చేసే దిశగా చర్యలు చేపట్టారు. దగ్గర్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి వారిని అందులో ఓటు హక్కు వినియోగించుకునేలా తుది జాబితా విడుదల చేశారు. గతంలో ఈ ప్రక్రియ చేపట్టకపోవడంతో పలువురు ఓటు వేసే అవకాశం లేక వెళ్లిపోయేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా రాజకీయ పక్షాల సూచనలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాలను దగ్గరలోనే ఏర్పాటు చేశారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో 49.63 శాతం పోలింగ్..

◆ మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న కుత్బుల్లాపూర్ అసెంబ్లీలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 5.60 లక్షల ఓటర్లు ఉండగా 49. 63 పోలింగ్ జరిగింది. తాజా గణాంకాల ప్రకారం 7. 24 లక్షల ఓటర్లు ఉండగా పోలింగ్ శాతం పెరుగుతుందా .. తగ్గుతుందా అనే విషయంపై ఈనెల 13న జరిగే ఓటింగ్ సరళి నిర్ణయిస్తుంది.

◆ ఒక పక్క తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే అసెంబ్లీ పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఓటర్లు పెద్ద ఎత్తున అక్కడికి తరలి వెళ్లడంతో గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

◆ ముఖ్యంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సీమాంధ్రులు నివసిస్తుండగా.. కొంపల్లి, చింతల్ పరిధిలో సైతం వీరి సంఖ్య అధికంగానే ఉంది. రెండు చోట్ల ఓటింగ్ అవకాశం ఉన్న వీరు అక్కడికి వెళ్లే క్రమంలో స్థానికంగా ఓటును వేయకపోవడంతో ఇక్కడ ఓటింగ్ శాతం తగ్గే అవకాశాలు ఉన్నాయి.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నగేశ్

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నగేశ్ అన్నారు. ఈనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల నేపథ్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మేలు చేసే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. నోటాకు మాత్రం ఓటు వేయొద్దని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 42 శాతమే ఓటింగ్ నమోదయ్యిందని తెలిపారు. ఈసారి 100 శాతం ఓటింగ్ నమోదయ్యే విధంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలన్నారు. దేశం కోసం నిరంతరం శ్రమిస్తున్న వారిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి లక్ష్మిశ్రీ, సాయికుమార్, అక్షయ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పాటుపడే పార్టీ కాంగ్రెస్



కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు కార్మికులతో సమావేశమై తీర్మానం చేశారు. చింతల్ వాణినగర్ పార్టీ కార్యాలయంలో ఆయన పలు కార్మికులతో సమావేశం నిర్వహించి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని అప్పటి ప్రభుత్వం ఓడిస్తే మల్కాజ్‌గిరి ప్రజలు గెలిపించి ఢిల్లీకి పంపించారన్నారు. అదే తరహాలో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ జిల్లా పరిషత్ చైర్మన్‌గా అందరికీ సుపరిచితురాలైన సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఉరేసుకుంటున్న యువకుడిని కాపాడిన పోలీసులు



జగద్గిరిగుట్ట పోలీసులతో యువకుడు సాయికుమార్

జగద్గిరిగుట్ట: ఉరి వేసుకుంటున్న ఓ యువకుడిని జగద్గిరిగుట్ట పోలీసులు కాపాడారు. అంజయ్యనగర్‌కు చెందిన సాయికుమార్ వ్యక్తిగత కారణాలతో తాను చనిపోతున్నానని ఏలూరులో ఉంటున్న తన బావ అనీల్‌కు ఫోన్ చేశాడు. వెంటనే అప్రమత్తమైన అనీల్ ఈ విషయాన్ని జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సాయికుమార్ ఉంటున్న అడ్రస్‌ను కనుక్కొని ఉరి వేసుకుంటున్న అతడిని కాపాడి స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో స్పందించి యువకుడి ప్రాణాలు కాపాడిన సీఐ క్రాంతి, పెట్రోలింగ్ సిబ్బంది గోపాల్, వినయ్‌లకు సాయికుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీకాంత్ (ఫైల్)

నిజాంపేట్: అనుమానాస్పద స్థితిలో డ్యూటీకి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి సాయిఅనురాగ్ కాలనీకి చెందిన శ్రీకాంత్(34) ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 9న డ్యూటీకి వెళ్లిన అతడు ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన కుటుంబీకులు వాకబు చేయగా అదే రోజు మధ్యాహ్నం 12గంటలకు వెళ్లిపోయినట్లు తెలిసింది. ఎంతకీ అతడి ఆచూకీ తెలియకపోవడంతో శనివారం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



అజీమ్ (ఫైల్)

సుభాష్‌నగర్: పనికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం కైసర్‌నగర్‌కు చెందిన ఖాజాబీ కుమారుడు సయ్యద్ అజీమ్(45) రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. కాగా ఈనెల 3వ తేదీన పనికి వెళ్లిన అతడు తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో శనివారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన రోబోటిక్ ఈవెంట్

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయస్థాయి రోబోటిక్ ఈవెంట్ శనివారం ముగిసింది. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈవెంట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచేరి రాష్ట్రాలకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తమ రోబోటిక్ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఎంఎల్ఆర్ఐటీ కళాశాల విద్యార్థులు రూపొందించిన 'చిట్టి'అనే రోబో ఆకర్షణీయమైన సంభాషణలతో అలరించి హైలెట్‌గా నిలిచింది.

తల్లికి గుడి కట్టేశాడు

కళ్ల ముందే అమ్మ!



భార్య స్వప్నతో తల్లి విగ్రహం వద్ద రామ్‌కుమార్



దుండిగల్: నవ మాసాలు మోసి.. పురిటి నిప్పులను పంటికింద బిగపట్టుకుని.. భరించలేనంత నొప్పి కలుగుతున్నా బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. తన ప్రపంచంలోకి వచ్చిన బిడ్డను అపురూపంగా హత్తుకుంటు తనకో ప్రపంచాన్ని చూపిస్తుంది. తన బిడ్డను అల్లారు ముద్దుగా పెంచుకుంటూ విద్యాబుద్ధులు నేర్పిస్తూ సమాజంలో తన బిడ్డ ఉన్నతమైన స్థానంలో ఉండాలని కోరుకుంటుంది మాతృమూర్తి.. తనకు జన్మనిచ్చిన తల్లి అర్ధంతరంగా తనువు చాలిస్తే తల్లడిల్లి పోయాడు పేగు చించుకుని పుట్టిన ఆ బిడ్డ. తన కళ్ల ముందే తన తల్లి ఉండాలని.. తన ప్రతిరూపాన్ని చూసుకోవాలని మురిసిపోయాడు. ఏకంగా తల్లి విగ్రహాన్నే ఇంట్లో ప్రతిష్ఠించి నిత్యం పూజలు చేస్తున్నాడు ఆ కుమారుడు. ఆదివారం 'మదర్స్ డే'సందర్భంగా 'సాక్షి'ప్రత్యేక కథనం.

◆ ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. అనేక కారణాలను చూపుతు తమ తల్లిదండ్రులను నిర్ధాక్షిణంగా వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్నారు. మరి కొందరైతే ఆస్తి కోసం, డబ్బు కోసం కనిపెంచిన తల్లిదండ్రలను మట్టు బెడుతున్నారు. ఇలాంటి సంఘటనలను మనం తరుచూ వింటూనే ఉన్నాం. కానీ నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాడు రామ్‌కుమార్.



విజయ లక్ష్మీ విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు

మనం సంస్థ ఏర్పాటు..

◆ మా అమ్మా నాన్న ఆశీస్సులు మెమోరియల్ (మనం) అనే స్వచ్ఛంద సంస్థను రామ్‌కుమార్ ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ ద్వారా వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

తల్లిని మించిన దైవం లేదు..



మా అమ్మ ఎప్పుడు నా కళ్ల ముందే ఉండాన్న ఉద్దేశంతో విగ్రహాన్ని తయారు చేయించి ఇంట్లో ప్రతిష్టించా. నిత్యం మా అమ్మకు పూజలు చేస్తున్నా. చిన్నప్పటి నుంచి మా అమ్మతో నాకు ప్రత్యేక అనుభవం ఉంది. ఒక్క కుమారుడిని కావడంతో అపురూపంగా పెంచారు. ప్రేమ వివాహం చేసుకుంటానని అమ్మకు చెప్పినా నా సంతోషాన్ని కాదనలేదు. పైగా మా వాళ్లే దగ్గరుండి మరి నా పెళ్లి జరిపించారు. మా కుటుంబంలో అందరి కంటే మా అమ్మే పెద్దది. అందరితో ఆమె ఎప్పుడు ఆప్యాయంగా మాట్లాడేది. అమ్మ చూపిన మార్గంలోనే పయనిస్తు ఇంకా మంచి పేరు తెచ్చుకుంటే చాలు. – రామ్‌కుమార్

ఓటేసేందుకు బైలెల్లారు..!



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు నగర ప్రజలు తమ సొంత ఊళ్లకు పయనమయ్యారు. ఇంజినీరింగ్ కళాశాలకు మూడు రోజులు సెలవు ప్రకటించడంతో సొంతఊళ్లకు వెళ్లేందుకు బస్ స్టాప్ ల వద్ద శనివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నగరం నుండి జిల్లాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులో కిక్కిరిసిపోయారు. మరి కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. – సుభాష్‌నగర్

ఖాళీ స్థలాల్లో షెడ్ల నిర్మాణం

రంగారెడ్డినగర్: పారిశ్రామికవాడల్లోని పలు పరిశ్రమల నిర్వాహకులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే గాంధీనగర్ పారిశ్రామికవాడలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు వదిలిన ఖాళీ స్థలాలను ఆక్రమించి పార్కింగ్ షెడ్లను ఏర్పాటు చేశారు. అంతటితో ఆగకుండా రోడ్డు స్థలాలను సైతం కబ్జా చేసి వస్తు సామగ్రిని నిల్వ ఉంచుతూ రాకపోకలకు ఆటంకాలు సృష్టిస్తున్నాయి. గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలోని సంజయ్‌గాంధీనగర్–గాంధీనగర్ రోడ్డులో ఓ ఫ్యాబ్రికేషన్ ఇంజినీరింగ్ పరిశ్రమ యాజమాన్యం రోడ్డును ఆక్రమించి భారీ ఇనుప సామగ్రిని డంప్ చేశారు. అంతే కాకుండా రోడ్డుకు ఓ పక్క ఇనుప ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి తమ స్థలంగా వాడుకుంటున్నారు.ఇలా రోడ్ల ఆక్రమణలకు పాల్పడుతున్న పరిశ్రమల యాజమాన్యాలు గుర్తించి ఐలా అధికారులు కఠినంగా వ్యవహరించాలని మిగతా పరిశ్రమల యాజమాన్యాలు కోరుతున్నాయి.

బంద్ భయం.. తీసుకుంటే నయం!



లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శనివారం సాయంత్రం మద్యం దుకాణాలకు తాళాలు పడ్డాయి. రెండు రోజులు బంద్ ఉండటంతో శనివారం సాయంత్రం వైన్స్‌ల వద్ద మద్యం ప్రియులు పోటెత్తారు.45నిమిషాల ముందే వైన్స్ దుకాణాలు మూసివేయడంతో వాగ్వాదానికి దిగారు. కొన్నిచోట్ల తోపులాటలు చోటు చేసుకున్నాయి. – సుభాష్‌నగర్

ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే వేగంగా అభివృద్ధి



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నేత చెరుకుపల్లి భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తారని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. ఈటల రాజేందర్‌కు మద్దతుగా జీడిమెట్ల డివిజన్‌లోని గాయత్రినగర్ ఫేజ్–2, దుర్గా ఎస్టేట్స్, ఎంఎన్‌రెడ్డి నగర్, బృందావన్ కాలనీ, వైష్ణవి ఎంక్లేవ్, కృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రధానిగా నరేంద్రమోదీని హ్యాట్రిక్‌గా గెలిపించాలన్నారు. అదే విధంగా మాల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మడం లేదన్నారు.

రూ.6లక్షల మద్యం స్వాధీనం

మోతీనగర్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా శుక్రవారం రాత్రి అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కైత్లాపూర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.6లక్షల విలువైన మద్యం లభించిందని ఇన్‌స్పెక్టర్ సామల వెంకట్‌రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లికి చెందిన ఏ1గా వినయ్‌గౌడ్, ఏ2గా వివేకానందనగర్‌కు చెందిన అనిల్, ఏ3గా అమీర్‌పేటకు చెందిన గోవింద్ సైదులు ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఎన్నికల ప్రచారం గడువు శనివారం ముగుస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ నేతలు స్పీడ్ పెంచారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకుడు రినేష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకర్గంలోని పలు కాలనీలు, బస్తీల్లో ఉదయం నుంచే ప్రచారం నిర్వహించారు. మల్కాజిగిరి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం పలు డివిజన్లలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

◆ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సాంతిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్‌కే...

నిజాంపేట్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిజాంపేట్ కమాన్ నుంచి బాచుపల్లి సిగ్నల్స్, ప్రగతినగర్ కమాన్, ప్రగతినగర్, అంబీర్ చెరువు, రెడ్డీ ఎవెన్యూ, బండారి లేఅవుట్, నిజాంపేట్ లాస్ట్ బస్టాప్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తమ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, ఆగం పాండుముదిరాజ్, ఇంద్రజిత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ఆవుల జగన్‌యాదవ్, రాజేశ్వరి, కొలన్ వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ఆవుల ప్రసన్న, ఏనుగుల శ్రీనివాస్‌యాదవ్, కో.ఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

అప్పుడు పరిశ్రమలు పోటెత్తాయి.. ఇప్పుడు తరలిపోతున్నాయి!

ఎమ్మెల్యే వివేకానంద్





రోడ్‌షోలో మాట్లాడుతున్న అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పరిశ్రమలు పోటెత్తాయని... నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్–2, జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్, సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్, రంగారెడ్డినగర్, చింతల్ డివిజన్లు, జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లలో రోడ్‌షోలు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని పదేళ్లగా ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎంపీగా లక్ష్మారెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందనే గ్యారంటీ లేదన్నారు. కుర్చీలను కాపాడుకోవడమే తప్ప రాష్ట్రాభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డికి పట్టడం లేదన్నారు.

◆ బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే హైదరాబాద్‌ను యూనియన్ టెరిటరీగా మారుస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, కార్పొరేటర్లు విజయశేఖర్‌గౌడ్, జగన్, మంత్రి సత్యనారాయణ, నాయకులు సురేష్‌రెడ్డి, రఫీ, డివిజన్ల అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరికి సీఎం రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదు : రాగిడి లక్ష్మారెడ్డి

కుత్బుల్లాపూర్: కొడంగల్‌లో ఓడిపోతే అక్కున చేర్చుకున్న మల్కాజిగిరి ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. సూరారం కాలనీ ఓం జెండా నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌లతో కలిసి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలోనే టీపీసీసీ అధ్యక్షుడిగా, తర్వాత ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి, అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

◆ హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయాలని బీజేపీ కుట్ర చేస్తుందని ఎమ్మెల్యే వివేకానంద్ ఆరోపించారు. జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు.

◆ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేఆర్‌సీఆర్ హరితవనం, ప్రగతినగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు, మేకల వెంకటేష్, బాలాజీ నాయక్, గాజుల సుజాత, రాఘవేందర్‌రావు, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, సునీత, రాజేందర్‌రెడ్డి, ఆయా డివిజన్ల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.